క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

కోట : కొత్తపాళెం సమీపంలోని చల్లకాలువ వద్ద శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ విచారణ చేపట్టారు. కొత్తపాళెంకు చెందిన ఆంజనేయకుమార్(52)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సమస్యల కారణంగా రాత్రి గొడవ పడి ఇంట్లో నుంచి వచ్చి చెట్టుకు ఉరేసుకున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీఆర్వో రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సత్తా చాటిన ఏకొల్లు జెడ్పీ విద్యార్థినులు

దొరవారిసత్రం : జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్స్ జూడో అండర్-14 విభాగం నందు మండలంలోని ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో సత్తా చాటారు. జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని హేమలత (57 కిలోల విభాగం), 7వ తరగతి విద్యార్థిని ఏంజెల్ (52 కిలోల విభాగం)లో బంగారు పతకాలు సాధించగా 8వ తరగతి విద్యార్థిని ఇందు (48 కిలోల) విభాగం నందు రజత పతకం సాధించినట్లు హెచ్‌ఎం నరసింహారావు తెలిపారు. ఆగస్టు 9,10 తేదీల్లో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధం చేస్తున్నట్లు పీఈటీ మాస్టర్ రమణయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు పతకాలు , సర్టిఫికెట్లు శనివారం అందజేసి సత్కరించారు. అభినందించిన వారిలో ఎంఈఓలు కొండయ్య, కృష్ణయ్య, హాస్టల్ వార్డెన్ శేషమ్మ, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐటా ఉమెన్స్ సింగిల్స్ విజేత లక్ష్మీసిరి



టోర్నీ విన్నర్‌గా నిలిచిన లక్ష్మీసిరి

గూడూరు రూరల్ : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో జులై 28 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జరిగిన ఐటా (ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్) ఉమెన్స్ వన్ ల్యాక్ టోర్నమెంట్‌లో గూడూరు పట్టణానికి చెందిన లక్ష్మీసిరి గెలుపొందింది. ఈమె క్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణకు చెందిన తానియాసాపై 6-0, 1-0 (రిటైర్డ్) తో గెలుపొందింది. సెమీ ఫైనల్స్‌లో తెలంగాణకు చెందిన మనోజ్ఞ మదసుపై 6-1, 2-6, 4-1(రిటైర్డ్) గెలుపొందింది. అదే విధంగా ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన జోయల్ నికోల్‌పై 6-1, 6-3 తేడాతో గెలుపొంది , టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఆమె గతంలో పలు అంతర్జాతీయ, జాతీయ టోర్నమెంట్‌లలో పాల్గొని పలు పతకాలను సాధించింది.

గనుల్లో గద్ద!

ఓ ముఖ్యనేత కనుసన్నల్లో మైనింగ్



ఖనిజాన్ని వెలికి తీస్తున్న ఓపెన్ క్వారీ

గనులను పీల్చిపిప్పి చేయడంలో ఆ పెద్దనేత దిట్ట. మైనింగ్ పరిశ్రమలో అనధికారిక ఆంక్షలు పెడుతూ గనుల యాజమాన్యాన్ని కొన్ని నెలలుగా ముప్పుతిప్పలు పెడుతున్నారు. కానీ ఆ ముఖ్యనేతలకు కప్పం కడితే ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రైట్ ..రైట్ చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆయనకు రాష్ట్ర స్థాయిలో పెద్దనేతలతో సంబంధాలు ఉండడంతో అధికారులు కూడా కిమ్మనడం లేదు. ఖనిజ విలువలో 20 నుంచి 30 శాతం వరకు వసూళ్లు చేసుకుని దర్జాగా దోచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

- కప్పం కడితే రైట్.. రైట్
- సిండికేట్ ఉచ్చులో మైనింగ్ పరిశ్రమ
- 20 నుంచి 30 శాతం దాకా అనధికారిక రాయల్టీ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- బెంబేలెత్తుతున్న గని యజమానులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి పాలన ఏర్పడినప్పటి నుంచి గనులను దోచుకునేందుకు రకరకాల భూచోళ్లతో మైనింగ్ పరిశ్రమ కుదేలయింది. గడిచిన 14 నెలలుగా మైనింగ్ పరిశ్రమపై వివిధ ఆంక్షలు పెడుతూ చివరకు ఓ పెద్దనేతకు మైనింగ్ పరిశ్రమను అప్పనంగా అప్పగించేశారు. సిండికేట్‌కు కప్పం కడితే ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అన్నీ అనుమతులు ఇచ్చేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే మైనింగ్ పరిశ్రమ ప్రస్తుతం నడుస్తోంది. కనీవిని ఎరుగని రీతిలో సిండికేట్‌కు ఖనిజ విలువలో 20 నుంచి 30 శాతం వరకు వసూళ్లు చేసుకుని తమ జేబులను నింపుకుంటున్నారు. అదీ కాకుండా ఓ ముఖ్యనేతకు అందులోంచి మరో 2 నుంచి 3 శాతం వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఖనిజ విలువ కూడా గతంలో కన్నా తగ్గుముఖం పట్టడంతో గని యాజమాన్యం లబోదిబోమంటోంది.



ఖనిజాన్ని వేరు చేసే యంత్రాలు

అంతర్జాతీయంగా డిమాండ్

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో భూగర్భ గనులు 7 కాగా 140 మైకా, క్వార్ట్జ్ గనులతో పాటు గూడూరులో 75 సిలికా ఇసుక గనులున్నాయి. వీటిపై ఆధారపడిన పరిశ్రమలు మరో 100కు పైగా నడుస్తున్నాయి. ఈ యూనిట్లు అన్ని ఇక్కడ లభించే ముడి ఖనిజంపై ఆధార పడుతున్నాయి. పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వెంకటగిరి నియోజకవర్గంలోని అంతర్భాగమైన సైదాపురం మండలంలో లభించే ఖనిజానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే ఖనిజంతో పాటు మైకాకు కూడా దేశ విదేశాల్లో మంచి మార్కెట్ ఉంది. సైదాపురం మండలంలో లభించే మైకా క్వార్ట్జ్ , మైకాకు జపాన్, చైనా, రష్యా దేశాలకు ఎగుమతి అవుతోంది.

రోజుకు 500 టన్నుల తరలింపు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సైదాపురం, గూడూరు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు 500 టన్నుల మైకా క్వార్ట్జ్ ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అవి కూడా సిండికేట్ అనుమతితోనే ఇతర ప్రాంతాలకు రవాణా అవుతోంది. ఈ ప్రాంతంలో లభించే మైకా క్వార్ట్జ్‌కు కూడా టన్ను 25 వేల నుంచి 2 లక్షల వరకు ధర పలుకుతుండటంతో సిండికేట్‌కు కప్పం కట్టి రవాణా చేస్తున్నారు.

సిండికేట్ వసూళ్లు ఇలా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 30 గనుల్లో లభించే మైకా క్వార్ట్జ్ ఖనిజానికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఈ ఖనిజాలు కూడా ఆయా దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు తరలించేందుకు అనుమతి పొందడంతో ఆ గనుల నుంచి వచ్చే ఖనిజాలను మాత్రమే ఇతర దేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఖనిజం టన్ను 20 వేలు ఉంటే సిండికేట్‌కు టన్నుకు రూ.4 వేలు చొప్పున ఒక లారీకి 30 టన్నులు వేస్తే రూ.లక్షా 20 వేలు సిండికేట్‌కు చెల్లించాల్సి వస్తోంది. అలా ఇక్కడ లభించే ఖనిజం 20 వేల నుంచి 85 వేల వరకు ధర పలుకుతుంది. ప్రస్తుతం ఆ లెక్కను టన్ను 80 వేలు వంతున విక్రయిస్తే గని యజమాని సిండికేట్‌కు ఒక లారీ పంపితే 30 టన్నులకు రూ.4 లక్షలా 80 వేల వంతున సిండికేట్‌కు చెల్లించాల్సి వస్తోంది. దానికి తోడు మరో ముఖ్యనేతలకు అదీ కాకుండా మరో 2 నుంచి 3 శాతం చెల్లించాల్సి వస్తోంది. దీంతో గని యజమానులు లబోదిబోమంటున్నారు. అన్ని అనుమతులు ఉన్నా గని యజమానులు సిండికేట్‌కు ఆ మొత్తం నగదు చెల్లిస్తున్నారు. అలాగే కొన్ని యార్డులకు కూడా అనుమతులను మంజూరు చేశారు .ఆ యార్డు యజమానులు కూడా ఆ వంతునే నగదును సిండికేట్‌కు చెల్లింపులు ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా సైదాపురం మండలంలో వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను కూడా సిండికేట్ రాయుళ్లు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఏర్పాటు చేసి కార్యాలయం కూడా సైదాపురం–ఊటుకూరు మధ్యలో ఏర్పాటు చేయడం గమనార్హం.



అధిక టన్నేజీలతో తరలిస్తున్న దృశ్యం

ఖనిజం కోసం విదేశీ ప్రతినిధులు



మైకా క్వార్ట్జ్ ఖనిజం

ఇక్కడ లభించే క్వార్ట్జ్ ఖనిజానికి జపాన్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఖనిజం మండలంలోని 30 గనుల్లో లభిస్తోంది. ఈ ఖనిజాన్ని ప్రధానంగా చైనా కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఈ ఖనిజం కేవలం వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లోని మైకా గనుల వద్దనే లభిస్తోంది. దీంతో ఆ ఖనిజం కోసం నిత్యం ఇతర దేశాల ప్రతినిధులు వస్తుంటారు. ఈ ఖనిజం కూడా మరో వందేళ్ల వరకు పుష్కలంగా నిల్వలు ఉన్నాయి. గతంలో ఈ ఖనిజం పనికి రాకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ గుట్టలు గుట్టలుగా వదిలేసేవారు. ప్రస్తుతం ఆ ఖనిజానికి డిమాండ్ ఉండడంతో స్థానికంగానే రూ.25 వేల నుంచి 2 లక్షలకు ధర పలుకుతుండటంతో ఆ ఖనిజాన్ని ఎక్కడ పడితే అక్కడ నిలువునా దోచుకుంటున్నారు.

యజమానులకే హక్కు కల్పించాలి



"మైనింగ్ పరిశ్రమను ప్రభుత్వం కాపాడాలి. సిండికేట్ చేతుల్లోంచి యజమానులకే హక్కు కల్పించాలి. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కార్మికులు కూడా గిట్టుబాటు ధర ప్రస్తుతం లభించకపోవడంతో కూలీలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు.

– డీపీ పోలయ్య , రైతు కూలీ సంఘం జిల్లా నేత

9 నుంచి సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సేవలు

తిరుపతి కల్చరల్ : సప్త మోక్ష క్షేత్ర యాత్ర సెప్టెంబర్ 9న రైలు ద్వారా దేశంలోని పలు పుణ్య క్షేత్రాల సందర్శనకు మంచి ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సప్తమోక్ష క్షేత్ర యాత్ర రైలు ప్యాకేజీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 రోజుల పాటు దేశవ్యాప్తంగా ఏడు నదులు, నాలుగు జ్యోతిర్లింగాల ప్రాంతాలను ఈ ప్యాకేజీ ద్వారా చూపించి తిరిగి వారి స్వస్థలాలకు తీసుకురావడం జరుగుతుందన్నారు. 650 మంది ప్యాసింజర్లను ఈ యాత్ర రైలు ద్వారా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మూడు విభాగాలుగా ఈ ప్రత్యేక రైలులో ప్యాకేజీ టికెట్ ధరను నిర్ణయించామని తెలిపారు. థర్డ్ ఏసీ(కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ(డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ(లగ్జరీ) రూ.69,500గా ఉన్నాయన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తొట్టంబేడు : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలంలో చోటు చేసుకుంది స్థానికుల కథనం మేరకు తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం వద్ద ఓ వాహనం ద్విచక్ర వాహనంలో వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి(50)ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తొట్టంబేడు పోలీసులు అక్కడికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. లభ్యం కాకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పలు పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చిల్లకూరు, డక్కిలి, కోట, నాయుడుపేట, పుదూరు, సూళ్లూరుపేట, వాకాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వాకాడు పాఠశాలలో ఐదో తరగతిలో ఉన్న పరిమిత ఖాళీలకు, నాయుడుపేటలోని తొమ్మిదో తరగతిలో ఉన్న ఖాళీలకు, నాయుడుపేట, చిల్లకూరులోని పాఠశాలల్లో బైపీసీ, ఎంపీసీ, వాకాడులో సీఈసీ, ఎంఈసీ ఖాళీలకు, పుత్తూరులోని సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో ఉన్న ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి, ఈ నెల 11లోపు నేరుగా ప్రవేశాలు పొందాలని తెలియజేశారు.

కాలువ ఆధునీకరణ పనులపై నివేదిక ఇవ్వండి

వరదయ్యపాళెం: శ్రీసిటీ మీదుగా వెళ్లే ఇరిగేషన్‌కు చెందిన కరిపేటి కాలువ ఆధునీకరణ పనులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీసిటీలోని కరిపేటి కాలువను కలెక్టర్ సందర్శించారు. ఇటీవల శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాల సమీపంలో కరిపేటి కాలువ సంబంధించి శ్రీసిటీ యాజమాన్యం కాలువ పూడికతీత పనులతో పాటు కట్టను బలోపేతం చేసే పనులను చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించి అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాలువలో పూడికతీత పనులకు సంబంధించి తవ్విన మట్టిని బయటకు తరలిస్తున్నారని కేవీబీపురం మండలం మద్రాసు బాబు హైకోర్టులో కేసు వేశారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు పూర్తి వివరాలను అందించాలని కలెక్టర్‌కు సూచించడంతో ఆయన పనులు జరిగిన కరిపేటి కాలువను సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం శ్రీసిటీ పరిధిలోని ఈస్ట్ మల్లవారిపాళెం చెరువును పరిశీలించారు.



శ్రీసిటీలోని కరిపేటి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నకిలీ మీడియాను అరికట్టేందుకే స్టిక్కర్ల పంపిణీ

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా నకిలీ మీడియాను అరికట్టేందుకు ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్టులందరికీ స్టిక్కర్లను పంపిణీ చేశామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆయన శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే వాళ్లు కూడా మీడియా ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారని తెలిపారు. అంతే కాకుండా చాలామంది వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు అంటించుకుని తిరుగుతున్నారని తెలిపారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కొన్ని వందల వాహనాలకు స్టిక్కర్లు తొలగించామన్నారు. నిజాయితీగా వర్కింగ్ జర్నలిస్ట్‌గా ఉన్న వారందరికీ గుర్తింపు ఇచ్చేందుకు పోలీస్ విభాగం తరఫున ద్విచక్ర వాహనాలు, కార్లకు స్టిక్కర్లను పంపిణీ చేశామన్నారు. ఈ స్టిక్కర్ తగిలించుకున్న మీడియా ప్రతినిధులు ఎలాంటి ప్రోగ్రాములకైనా పోలీసుల ద్వారా ఇబ్బంది లేకుండా అనుమతి ఇస్తామన్నారు. అంతేకాకుండా ఈ స్టిక్కర్ స్కాన్ చేస్తే ఆ మీడియా ప్రతినిధి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఎడిషన్‌లో పనిచేసే పాత్రికేయుల వాహనాలకు వున్న ఈ స్టిక్కర్లను చూసి పోలీసులు అనుమతి ఇస్తారని వెల్లడించారు. ఈ స్టిక్కర్లను కాపీ చేయకుండా పకడ్బందీగా తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ మురళి, సెక్రటరీ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.



వాహనానికి పోలీస్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

విద్యాసంస్థల్లో కెమెరాలు తప్పనిసరి

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో అత్యంత మెరుగైన కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. నగరంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్కూలు, కాలేజీల యాజమాన్యాలతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. అయితే స్కూల్ పెట్టడం ఎంత ముఖ్యమో దాని భద్రత కూడా అంతే ముఖ్యమని తెలిపారు. తక్కువ పని తీరు గలిగిన కెమెరాలను తొలగించి అత్యధిక పరిణామాలు కలిగిన కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటర్ చదువుతున్న పిల్లలు కూడా మైనర్లే కనుక ఎవరైనా రాజకీయ నాయకుల సభలకు సమావేశాలకు పంపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో విద్యాసంస్థల యజమానులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

14న మత్స్యకారులకు ఇళ్ల పట్టాలు

తడ : మత్స్యకారులకు పూడి గ్రామం వద్ద కేటాయించిన భూమికి సంబంధించిన పట్టాలను ఈనెల 14వ తేదీన అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన ఎస్సీ, ఎస్టీ కులాల వారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ శుక్రవారం ఇరకం వచ్చారు. పడవ ప్రయాణం అనంతరం ట్రాక్టర్ మీద గ్రామంలోకి చేరుకున్న ఆయన పింఛన్ల కార్యక్రమం ప్రారంభించి స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, డీఆర్‌డీ ఏపీడీ శోభన్‌బాబు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రేపటి వరకు గురుకులంలో అడ్మిషన్లకు అవకాశం

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని ఖాళీ సీట్లలో ప్రవేశానికి ఆదివారం వరకు అవకాశం ఉందని జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి పోటీ పరీక్షలు లేకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాయుడుపేట, కోట, వాకాడు పాఠశాలల్లో ఐదవ తరగతిలో చేరడానికి, నాయుడుపేటతో 9వ తరగతి, నాయుడుపేట, చిల్లకూరులో బైపీసీ, ఎంపీసీ, వాకాడులో సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరడానికి బాలురికి అవకాశం ఉందన్నారు. అలాగే పుత్తూరులోని కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీలో చేరడానికి బాలికలకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16 పీహెచ్‌సీల్లో పింక్ బస్ క్యాంపులు

తిరుపతి తుడా: స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో ఈ నెలలో జిల్లాలోని 16 పీహెచ్‌సీల్లో పింక్ బస్ క్యాంపులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో బీపీ, షుగరు పరీక్షలతోపాటు మహిళలు, పురుషులకు నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల నిర్ధారణకు మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. 4న కేవీబీపురం మండలంలోని కోవనూరు పీహెచ్‌సీలో, 7న నిడిగుర్తి, చిన్నపాండూరు, 11న వళ్లిపేడు, చింతవరం, 14న వరగళి, బాలిరెడ్డిపాళెం, 18న జికె.పల్లి, చెన్నూరు, 21న బాలాయపల్లి, డక్కిలి, 25న చిట్టేడు, చిల్లకూరు, 28న దాసుకుప్పం, బంగారుపేట పీహెచ్‌సీలో క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించారు.

మద్యం మత్తులో చెరువులోకి దిగి యువకుడి మృతి

సత్యవేడు : సత్యవేడు పంచాయతీ ఎస్సీ కాలనీ చెందిన జేమ్స్(33) మద్యం మత్తులో చెరువులో స్నానానికి దిగి నీట మునిగి మృతి చెందాడు. ఎస్సీ కాలనీకి చెందిన జేమ్స్ మత్తుకు బానిసై జులాయిగా తిరిగేవాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన జేమ్స్ దళవాయి అగ్రహారం చెరువు కట్టపై ఉన్న గుడి వద్ద చిన్న పనులు చేసి వచ్చిన డబ్బుతో మద్యం తాగి ఆ మత్తులో చెరువులోకి స్నానానికి దిగి నీటిలో మునిగి పోయాడు. శుక్రవారం ఉదయం చెరువులో శవం తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బయటకు తీయించారు.

ఆంక్షలు పెట్టి ఆపలేరు!

వెంకటగిరి (సైదాపురం) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాభిమానం మెండుగా ఉందని.. ఎవరు ఎన్ని ఆంక్షలు పెట్టినా అభిమానాన్ని ఆపలేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శ నిమిత్తం గురువారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన విఫలం చేసేందుకు ఎక్కడికక్కడ కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడంపై నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అంటే కూటమి ప్రభుత్వానికి భయమేస్తోందని విమర్శించారు. ఎక్కడికక్కడే పర్యటనలకు అనుమతి ఇవ్వకుండా ఆంక్షలతో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. వెంకటగిరి నుంచి నెల్లూరుకు తరలిన కార్యకర్తలు, కౌన్సిలర్లను పోలీసులు అడ్డుకొని ఇబ్బందులు పెట్టినట్లు విమర్శించారు. నెల్లూరు జగన్ పర్యటనకు 2000 మంది పోలీసులు కేటాయించారని ,అయితే ఆ పోలీసులు జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించేందుకు కాదని ఎక్కడికక్కడే వైఎస్సార్‌సీపీ నేతలను రానివ్వకుండా కట్టడి చేసేందుకు నియమించినట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చేసిందని ప్రభుత్వం చేసే కుట్రలు విఫలం కాక తప్పదన్నారు. తమ అధినేతను కలుసుకునేందుకు ఆంక్షలు పెడితే ఎవరూ చూస్తూ ఉండరని త్వరలో బహిరంగ సభ పెట్టి తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఆంక్షలను లెక్క చేయకుండా నెల్లూరు వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 15 తర్వాత పరీక్షలు నిర్వహించాలని వైఎస్సార్ టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించనున్న ఎఫ్ఏ-1 పరీక్షలు ఈ నెల 15 తర్వా త నిర్వహించాలన్నారు. ఈ నెల 1వ తేదీన నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలను ఈ నెల 11 నుంచి 14 వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించారన్నారు.

రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలి

పలమనేరు: జిల్లాలో రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు పలమనేరు నియోజకవర్గంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

క్లుప్తంగా

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

దొరవారిసత్రం : వరిలో సస్యరక్షణ చర్యలపై తిరుపతి పరిశోధన కేంద్రం నుంచి విచ్చేసిన వ్యవసాయాధికారి శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని తల్లంపాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన వచ్చే లాభాల గురించి వివరించారు. రసాయనాల పిచికారీ ద్వారా పురుగులు, తెగుళ్ల నియత్రణను రైతులు అస్త్రంగా ఉపయోగించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ జ్యోతిర్మయి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జయబాబు సేవలు చిరస్మరణీయం



జయబాబుకు నివాళులర్పిస్తున్న నాయకులు

నాయుడుపేటటౌన్ : ప్రముఖ పారిశ్రామికవేత్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ గౌరవాధ్యక్షులు దివంగత పెసల జయబాబు (జయప్రకాష్) సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం నాయకులు కొనియాడారు. జయబాబు జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి నాయకులు, ఆర్య వైశ్యులతోపాటు అనేక మంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో వందలాది మంది పేదలతో కలసి భుజించారు. కార్యక్రమంలో పెసల జయరాజగోపాల్, కిషోర్‌బాబు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కనమర్ల పూడి సుబ్రమణి, సంఘం నాయకులు కోటా వెంకటేశ్వర్లు, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ సేవలు ప్రశంసనీయం



రాపూరులో లక్ష్మణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఏడీ అనిల్‌కుమార్

రాపూరు: స్థానిక ప్రభుత్వ పశువైద్యశాల పరిధిలోని సైదాపురం మండలం ఊటుకూరు పశువైద్యశాలలో వీఎల్‌ఓగా పనిచేస్తూ విరమణ పొందిన చేసిన లక్ష్మణ్‌కుమార్ సేవలు ప్రశంసనీయమని సహాయ సంచాలకులు అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం లక్ష్మణ్‌కుమార్‌ను రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల పశువైద్యులు, సిబ్బంది, కుటుంబసభ్యులు ఘనంగా సన్మానించారు. ఏడీ అనిల్ మాట్లాడుతూ 28 ఏళ్లపాటు పశువులకు సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, సుప్రజ, పశుసిబ్బంది పాల్గొన్నారు.

కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



ఈఎస్ఎస్ ప్రసాద్

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న ఏపీఎస్‌పీ 9వ బెటాలియన్ కమాండెంట్‌గా ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాది క్రితం కమాండెంట్‌గా ఉన్న ప్రకాష్ పదోన్నతిపై వెళ్లడంతో అప్పటి నుంచి అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్ ఇన్‌చార్జి కమాండెంట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మంగళగిరి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఈఎస్ఎస్ ప్రసాద్‌ను వెంకటగిరి 9వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎంఈఓ-1గా పద్మనాభం



ఎంఈఓ పద్మనాభంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

కలువాయి(సైదాపురం): మండల విద్యాశాఖ అధికారి-1గా పద్మనాభం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జీహెచ్ఎస్ కుల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యాశాఖ అధికారి-2 జి శేషగిరిరావు, సీఆర్‌ఎంటీలు ఆఫీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య పనులు

వాకాడు: ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టారు. వాకాడు దళితవాడలోని డ్రైనేజ్ కాలువల్లో వైద్య సిబ్బంది బ్లీచింగ్ చల్లారు. అనంతరం ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

చికెన్ ధరలు		02.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	114
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజు శుక్రవారం స్వామికి చందనంతో అలంకరించి, శాంతి హోమం, కల్యాణం, అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై ఊరేగించారు. ఆదిలక్ష్మీ దేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవం, కుంకుమార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పద్మపీఠంపై కొలువు తీర్చి వివిధరకాల పుష్పాలు ఆభరణాలతో అలంకరించి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవాన్ని (ప్రదక్షిణలు), మహిళలచే కుంకుమార్చన సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పెంచలకోనలో విశేషాలంకరణలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారు

శాకాంబరి



శాకాంబరి అలంకరణలో ఆలయం, గ్రామదేవత పోలేరమ్మ

నాయుడుపేటటౌన్ : శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు పలు ఆలయాల్లో వ్రత పూజలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద గ్రామ దేవత పోలేరమ్మ, పోతురాజులకు శాకాంబరి అలంకారం చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారితో పాటు ఆలయం మొత్తం కూరగాయలతో శోభాయమనంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఈఓ రవికృష్ణ సారథ్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి బంగారు చీర, వెండి తోరణాలతో అలంకారణలు చేపట్టి పూజలు జరిపారు. శివాలయంలోని అఖిలాండేశ్వరి దేవికి ప్రత్యేక అలంకారం చేపట్టడంతో భక్తులు పూజలు జరుపుకున్నారు. తిమ్మాజి కండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేపట్టి పూజలు చేశారు. పట్టణంలోని అంకాళమ్మ, మూకాంబికా, బేరిపేట లోని మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు శ్రావణ శుక్రవార పూజలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం ఆలయాల వద్ద మహిళలు ప్రమిదలు వెలిగించి దీపలక్ష్మీ పూజలు చేశారు.

పుష్పయాగం



చెంగాళమ్మ పరమేశ్వరికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు

సూళ్లూరుపేట : ఆంధ్రా-తమిళనాడు భక్తులకు ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ పర్యవేక్షణలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలోని ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పుష్పయాగాన్ని నిర్వహించారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు-సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి-లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మాజీ పాలకమండలి సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతి తదితరులు పాల్గొన్నారు.



పుష్పయాగంలో ఉభయకర్తలు నంబూరు కుటుంబ సభ్యులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రాపూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.4 లక్షలు విలువ చేసే 10 కంప్యూటర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి శుక్రవారం వితరణగా అందించినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతయ్య తెలిపారు. స్థానిక డిగ్రీకళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ రూంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీకాం కంప్యూటర్స్ విద్యార్థుల ఉన్నతి కోసం దాత కంప్యూటర్లతో పాటు ఒక ఏసీ కూడా అందించారని వివరించారు. కళాశాల అధ్యాపకులు దాత మధుసూదన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజర్ దండోలు లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి సన్నిధిలో కిలివేటి సంజీవయ్య



ప్రత్యేక పూజలు చేస్తున్న సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పండ్లూరు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురంలో నూతనంగా శ్రీ కృష్ణ భగవాన్ ఆలయం నిర్మాణం చేపట్టి మూడు రోజుల పాటు కుంభాభిషేక వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శ్రీ కృష్ణ భగవాన్ ఆలయంలో ప్రత్యేక పూజలుచేశారు. ఆయనతోపాటు మాజీ సర్పంచ్ అత్తికాయల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ అత్తికాయల కృష్ణవేణి పార్టీ నాయకులు ఉన్నారు.

లాడ్జిలో వ్యభిచారం..

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని లాడ్జిలో వ్యభిచారం జరుగుతున్న సమాచారంపై గురువారం రాత్రి సీఐ బాబీ పోలీసులతో తనిఖీ చేపట్టారు. లాడ్జీ వద్ద ఉన్న ఇద్దరు మహిళతో పాటు నిర్వాహకుడైన భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోట: మండల పరిధిలోని కేసవరం వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో తిన్నెలపూడికి చెందిన సుభాష్ చంద్రబోస్‌కు గాయాలయ్యాయి. సుభాష్ చంద్రబోస్ బైక్‌లో గూడూరుకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన వాకాడు డిపో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

మూడు వారాలుగా ఉపాధి కూలీ అందడం లేదు



ఉపాధి పనులు పరిశీలన చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వాకాడు: గత మూడు వారాల నుంచి ఉపాధి పనుల కూలీ డబ్బులు సక్రమంగా రావడంలేదని కూలీలు వాపోయారు. వాకాడు చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. కూలీలు తమ గోడును ఎంపీడీఓకు విన్నవించారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు రావడంలేదని, తాము ఎలా బతకాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ కూలీ డబ్బుల విషయమై తమపై అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కూలీలను కోరారు.

మహిళా కండక్టర్ సస్పెన్షన్‌పై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న మహిళా కండక్టర్ పద్మను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ.. డిపోకు ఇన్‌ఛార్జి మేనేజర్ మునిచంద్ర 01-2019 జీవోకు విరుద్ధంగా మహిళా కండక్టర్‌ను సస్పెండ్ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అక్రమ సస్పెన్షన్‌ను ఖండిస్తూ డిపోలోని ఎన్ఎంయూ ఉద్యోగులు నిరసన తెలియజేశామన్నారు. కార్యక్రమంలో డిపోలోని కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ సహకరిస్తుంది

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీ, నియోజకవర్గ అభివద్ధికి వైఎస్సార్‌సీపీ సహకరిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన జరగాల్సిన కౌన్సిల్ అత్యవసర సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా పడడంపై వ్యక్తమైన పలు విమర్శలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచారని తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ గురువారం నెల్లూరుకు వస్తున్న సందర్భంగా కౌన్సిలర్లు ఆయన్ను కలవడం కోసం వెళ్లారని చెప్పారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడినట్లు తెలిపారు. పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని గుర్తుచేశారు. గత ఏడాదిలో జాతర నిర్వహణలో తప్పిదాలు జరిగాయంటూ స్వాక్షాత్తు దేవదాయశాఖ మంత్రి అసహనం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాదైనా జాతరలో తప్పిదాలు జరగకుండా పోలేరమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రూ.కోటి నిధులు తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తమ కౌన్సిలర్లు ఎప్పుడూ సహకరిస్తారని సమావేశం ఎప్పుడు పెట్టినా హాజరవుతారని తెలియజేశారు.

నిమ్మ రైతులకు పట్టాలు ఇవ్వాలి

నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో సాగులో ఉన్న నిమ్మచెట్లను తొలగించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, నేదురుమల్లి విమర్శించారు. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతులను కలసి పట్టాలు ఇస్తామని భరోసా ఇచ్చారని అయితే రైతులను కలిసిన నెలల వ్యవధిలో నిమ్మ చెట్లను తొలగించారని తెలిపారు. ఈ మేరకు రైతులకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ప్రకారం మేరకు రైతులకు పట్టాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, ధనియాల రాధ, కందాటి కల్యాణి, వహిద, సుకన్య, ఆటంబాకం శ్రీనివాసులు, సుబ్బారావు, ఆరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి పరామర్శ



కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : మండలంలోని కలపాడు గ్రామానికి వైఎస్సార్‌సీపీ నేత గొర్ల కృష్ణయ్య (42) అనారోగ్యానికి గురై గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలపాడులోని కృష్ణయ్య నివాసం వద్దకు చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య వెంకటరమణమ్మ, కుమారులు మహేష్, పవన్‌సాయికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్, నేతలు శ్రీనివాసులు, ములవాయిల వెంకటేశ్వర్లు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆటో- బైక్ ఢీ : ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన ఆటోను ఢీకొన్న బైక్





ప్రమాదంలో గాయపడిన వారు

సైదాపురం : ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అయిదుగురు గాయపడ్డారు. తృటిలో ఘోర ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పెరుమాళ్లపాడు గ్రామానికి చెందిన పవన్ ఆటో నడుపుతూ సైదాపురం నుంచి స్వగ్రామమైన పెరుమాళ్లపాడుకు శుక్రవారం బయలుదేరారు. ఒక్కసారి ఏమి జరిగిందో ఏమో కాని రోడ్డుపై ఆటో తిరగబడిపోవడంతో ఆ ఆటో వెనుక వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో పల్టీలు కొడుతూ బోల్తా పడడంతో అందులో ఉన్న డ్రైవర్ పవన్, పార్వతి, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర కూడా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో బాధితులే స్వయంగా ఆటోలో స్థానిక ఆస్పత్రికి తరలించగా ఈశ్వర్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం గూడూరుకు తరలించారు.

నేడు మండల మీట్

చిట్టమూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికితప్పక హాజరు కావాలని కోరారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పోలీసులు వెలికితీసిన మృతదేహం

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని అయ్యప్పరెడ్డి పాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు దిగి గల్లంతైన దుప్పల వెంకటేశ్వర్లు(42) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మండల పరిధిలోని మర్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గురువారం నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. సీఐ బాబి, పీఎస్ఐ భాను ప్రసన్నతో పాటు అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ సిబ్బందితో స్వర్ణముఖి నది వద్ద శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పీఎం శ్రీ పథకానికి రెండు పాఠశాలల ఎంపిక

కోట: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపికైనట్లు ఎంఈఓ మస్తానయ్య శుక్రవారం తెలిపారు. పీఎం శ్రీ ద్వారా ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచడం, క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే పీఎం శ్రీ పథకం కింద చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలలో రూ.23లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

4 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో ఈనెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 15 సచివాలయాల్లో ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భవాని శుక్రవారం తెలిపారు.

కార్మికుడి మృతదేహానికి పోస్టుమార్టం

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సెజ్ పరిధిలో ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు శ్రీరామ్(21) ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. అతని మృతదేహానికి శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. మంగళగిరి ప్రాంతానికి చెందిన శ్రీరామ్ రెండేళ్లుగా మేనకూరు సెజ్ పరిధిలోని బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన శ్రీరామ్‌కు యాజమాన్య ప్రతినిధులు రూ.6 లక్షల పరిహారం అందిస్తామన్నారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం సాయంత్రం శ్రీరామ్ మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించారు.

కండలేరులో 26 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 26.224 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఈఓను కలిసిన యూటీఎఫ్ నేతలు

దొరవారిసత్రం : ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన కొండయ్యను శుక్రవారం యూటీఎఫ్ నాయకులు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో కలిసి సన్మానించారు. మండల, జిల్లా నాయకులు రాధాకృష్ణయ్య, దిలీప్‌కుమార్, విజయ్, చిరంజీవులు, వహీదా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్టం



కలువాయి: మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రాపూరు: తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సునందన



చిల్లకూరు: ర్యాలీ చేస్తున్న సీడీపీఓ, అంగన్‌వాడీ సిబ్బంది

రాపూరు/సైదాపురం/చిల్లకూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని అంగన్‌వాడీ సీడీపీఓలు సునందన, మహబూబి తెలిపారు. రాపూరు మండలంలోని వీరాయిపాళెం, సైదాపురం, కొమ్మిపాడు, కలువాయి మండలంలో రాజుపాళెం, వెంకటరెడ్డిపల్లి, తోపుగుంట, చిల్లకూరు మండలంలోని బూదనం, బల్లవోలు, కాకువారిపాళెం, వేళ్లపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు చేశారు. మహిళలకు గర్భిణులకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.